# త్వరలో బతుకమ్మ చీరెలు పంపిణీ

● మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్

రామాయంపేట/చిన్నశంకరంపేట, అక్టోబర్ 3: ప్రతి ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కానుకగా మహిళలకు అందజేసే బతుకమ్మ చీరెలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రామాయంపేట పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం రామాయంపేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పురపాలక పట్టణానికి ప్రభుత్వం 5,640 బతుకమ్మ చీరెలను పంపించిందన్నారు. ఈ సారెలను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిచేతుల మీదుగా త్వరలోనే అందజేస్తామన్నారు. పట్టణంలో ఉన్న ప్రతి ఆడపడుచుకు ప్రభుత్వ కానుకను అందిస్తామన్నారు. పట్టణవాసులకు వార్డుల వారీగా తెలియజేసి ఇంటింటికి కౌన్సిలర్ అధ్యర్యంలో అందిస్తామని చైర్మన్ వెల్లడించారు.

☛ రాష్ట్ర ప్రభుత్వం ఏటా బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు అందించే బతుకమ్మ చీరెలు మండలానికి చేరుకున్నాయి. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి వచ్చిన బతుకమ్మ చీరెలను అధికారులు మంగళవారం గ్రామాల వారీగా పంపించారు. మండలానికి 15,696 బతుకమ్మ చీరలు రావాల్సి ఉండగా 13,720 చీరలు మండలానికి చేరుకున్నాయి. మిగతా చీరెలు వారంలోగా మండలానికి వస్తాయని, త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు.


మాట్లాడుతున్న చైర్మన్ పల్లె


మున్సిపల్ కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న బతుకమ్మ చీరెలు


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శశిప్రభ

## ఇంటి పన్ను అన్ని గ్రామాల్లో వంద శాతం పూర్తి చేయాలి

చిలిపిచెడ్, అక్టోబర్ 3: మండలంలోని అన్ని గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీవో శశిప్రభ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేయాలని, హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్, ఆయా గ్రామాల కార్యదర్శులు తిరుపతి, నాగరాజు, జితేందర్, ఆనంద్, కృష్ణ, నగేశ్, హన్మంత్, దుర్గా, అఖిల్ పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శివ్వంపేట, అక్టోబర్ 3: శివ్వంపేట మండలం గోమారంలో బుధవారం (నేడు) పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని మంగళవారం సర్పంచ్ లావణ్యమాధవరెడ్డి తెలిపారు. రూ.20 కోట్ల సీఆర్ఎఫ్ నిధులతో మండలంలోని చండి గ్రామం నుంచి వయా గోమారం, నవాబ్‌పేట మీదుగా అనంతారం చౌరస్తా వరకు డబుల్ బీటీరోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి శంకుస్థాపన చేస్తారని, అదేవిధంగా గ్రామంలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కురుమసంఘం భవనం, ముదిరాజ్ భవనం, ముస్లిం మైనారిటీ భవనం నిర్మాణం కోసం రూ. కోటి 76 లక్షల 60వేల నిధులు మంజూరు కాగా వాటికి శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండగ సందర్భంగా మహిళలకు అందించే బతుకమ్మ చీరలను మహిళలకు అందజేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని ఆమె కోరారు.


బాలింత, బిడ్డను తరలించేందుకి సిద్ధంగా ఉన్న అంబులెన్సు

## తల్లి బిడ్డలను క్షేమంగా తరలిస్తాం

రామాయంపేట, అక్టోబర్ 3: ప్రభుత్వ దవాఖానలో ప్రసవించిన ప్రతి గర్భిణీ, ఆమె బిడ్డను క్షేమంగా వారింటికి తరలించడమే ప్రభుత్వ లక్ష్యమని రామాయంపేట సీహెచ్‌సీ వైద్యులు లింబాద్రి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం నుంచి ప్రసవాలు జరిగిన అనంతరం తల్లి బిడ్డలు ఎంత దూరంలో ఉన్నా ప్రభుత్వ అంబులెన్సులోనే ఉచితంగా తరలిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు వైద్యులు సుకేశిని తదితరులు ఉన్నారు.


బహుమతి అందుకుంటున్న కల్లూరి హర్షిత్ అండ్ టీమ్

## జాతీయ హాకీ క్రీడల్లో హర్షిత్ సత్తా

శివ్వంపేట, అక్టోబర్ 3: శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌కి చెందిన కల్లూరి హర్షిత్ జాతీయ హాకీ క్రీడల్లో అండర్-19 విభాగంలో సత్తా చాటి తెలంగాణకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారు. జాతీయ స్థాయిలో ఒడిశాలో జరిగిన హాకీ క్రీడల్లో తెలంగాణ తరుపున పాల్గొన్న కల్లూరి హర్షిత్ జట్టు మంగళవారం తమిళనాడు జట్టుపై విజయం సాధించడంతో తండ్రి ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ కల్లూరి కీర్తనహనుమంతరావు సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి హాకీ క్రీడల్లో పాల్గొనడమే లక్ష్యంగా క్రీడా సాధన చేస్తున్నాడని వారు తెలిపారు.

కల్లూరి హర్షిత్‌ను సర్వేయర్ కల్లూరి ముత్యాలు దంపతులు, కేవీఆర్ ట్రస్ట్ చైర్మన్ హనుమంతరావు, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. మండలానికి, గ్రామానికి పేరు, ప్రఖ్యాతులు తెచ్చిన హర్షిత్‌కు మండల వ్యాప్తంగా ప్రజలు, అధికారులు అభినందనలు తెలుపుతున్నారు.

## రుణమాఫీని వినియోగించుకోవాలి

చేగుంట, అక్టోబర్2: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పంట రుణమాఫీని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల వరకు పంట రుణమాఫీ చేసిందని, అవసరమైన రైతులు మళ్లీ రీషెడ్యూల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డితో పాటు వైస్ చైర్మన్ పట్నం తానీషా, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ శశికాంత్‌రెడ్డి, డైరెక్టర్లు రఘువీర్‌రావు, రాంరెడ్డి, పబ్బ శ్రీనివాస్, గణేశ్, సిద్ధిరాములు, సీవోలు శ్రీనివాస్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి


వినాయకుడి లడ్డూని అందజేస్తున్న నిర్వాహకులు

## వైభవంగా గణనాథుల నిమజ్జనం

చిలిపిచెడ్, అక్టోబర్ 3: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి మండల పరిధిలోని జగ్గంపేటలో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జనోత్సవాలు కనుల పండువగా సాగింది. జగ్గంపేట హనుమాన్ ఆలయం వద్ద వినాయకుడి లడ్డూను రూ.56 వేలకు బాలక్కొల్ల పోచయ్య గెలుచుకున్నారని ఆలయ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో కార్యదర్శి మృతి

రామాయంపేట, అక్టోబర్ 3:బ్రెయిన్ స్ట్రోక్‌తో రామాయంపేట మండలం దామరచెర్వు పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న సంధ్యారాణిని ఆదివారం పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండి కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు సోమవారం స్వగ్రామం కామారెడ్డి జిల్లా పాతరాజంపేటకు తీసుకెళ్లగా.. మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాయిబాబా, డీఎల్‌పీవో రాజేంద్రప్రసాద్‌లతో పాటు రామాయంపేటకు చెందిన కార్యదర్శులు, రామాయంపేట ఎంపీడీవో ఉమాదేవి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంధ్యారాణి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


కార్యదర్శి సంధ్యారాణి (ఫైల్)


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సతీశ్

## యూరియా మోతాదుకు మించి వాడొద్దు

నిజాంపేట,అక్టోబర్ 3: రైతులు పంటలకు అందించే యూరియాను మోతాదుకు మించకుండ వాడాలని మండల వ్యవసాయ అధికారి సతీశ్ రైతులకు సూచించారు. మండల కేంద్రం నిజాంపేటలో రైతులు సాగు చేస్తున్న వరి, కంది పంటలను సతీశ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో మొగిపురుగు ఉధృతి అధికంగా ఉందని, వీటి నివారణకు ఒక ఎకరాకు 400 గ్రా. చొప్పున కార్టాప్ హైడ్రోక్లోరైడ్‌ను నీళ్లల్లో కలిపి వ్యాధి సోకిన పంటకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కావేరి, రైతులు పాల్గొన్నారు.

## హెచ్ఎంకు సన్మానం

చేగుంట, అక్టోబర్ 2: చేగుంట మండలపరిధిలోని ఇబ్రహీంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) వి.లతాంబర్‌రావును మంగళవారం పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ అంజనేయులుతో పాటు పలువురు ఉపాధ్యాయులు శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు.


నూతన హెచ్ఎంను సన్మానిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్,ఉపాధ్యాయులు


పందులను పట్టి వ్యాన్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

## రామాయంపేటలో పందుల పట్టివేత

రామాయంపేట, అక్టోబర్ 3: రామాయంపేట పట్టణంలో పందులు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. ప్రజల ఫిర్యాదుల మేరకు స్పందించిన మున్సిపల్ చైర్మన్, అధికారులు మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పందులను పట్టేవారిని పిలిపి పట్టిస్తున్నారు. మొదటి రోజు 30 పందుల వరకు పట్టి వాటిని అటవీశాఖలో విడిచిపెడ్తున్నారు. పందుల మూలంగా వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, దీంతో పందులను పట్టణం నుంచి దాటవేస్తున్నామని మున్సిపల్ సిబ్బంది పేర్కొన్నారు. మంగళవారం మూడు వార్డుల్లో పందుల పట్టివేత కొనసాగుతుంది. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు నవనీత, నవీన్, శంకర్, దేవుని రాజు, సైదులు ఉన్నారు.